# క్షణకాలపు కల...!

శివలెంక రాజేశ్వరీదేవి



నేను అనుకోకుండా వూరు వెళ్ళవలసి వొచ్చింది. అంతా తయారయి ఆఫీస్ పేపర్స్ సర్ది డ్రస్ చేసుకుంటుండగా కాలింగ్‌బెల్ మోగుతోంది. ఒచ్చింది ఎవరో తెలుస్తూనే వుంది, ఆపకుండా మోగించే ఆ శబ్దానికి. కాసేపు తలుపు కొట్టీ, మళ్ళీ బెల్ మోగిస్తూ, వొచ్చిందంటే ఇంతే అసహనం. తలుపు తీసేదాకా ఆగలేదు. ఏదో పాటలోలా "నవ్వు వొచ్చిందంటే కిలకిలా ఏడుపొచ్చిందంటే వలవలా"...

'ఒస్తున్నా వొస్తున్నా' అంటూ షర్ట్‌బటన్స్ పెట్టుకుంటూ వొచ్చి తలుపు తీశాను. లోపలికి దూకుతూ 'ఇంతసేపా తలుపు తీయటం ఏంచేస్తున్నట్లు' అని నావంక పరిశీలనగా చూసి "ఏవిఁటి ఎక్కడికెడుతున్నావు మళ్ళీ చక్కగా ఫ్రెష్‌గా తయారయ్యావు" అంది.

"అనుకోకుండా ప్రయాణం ధరా!" అన్నా.

"మరీ నన్ను రమ్మనమని చెప్పావు కదా, అందుకే కదా ఇంత ఎండలో వొచ్చాను"

"మరీ ఆఫీస్ పనికదా?" ఆమె తరచూ వుపయోగించే ఆ 'మరీ' అన్న పదాన్ని పట్టి పలుకుతూ ఎలాయినా ఆమెని నవ్వించి నా ఆఫీస్ పని వొత్తిడి గురించి తెలియజేయాలని ప్రిపేర్ అవుతూ...

ఇక అప్పటినించీ ఒక పది నిమిషాల పాటు ఉక్కిరిబిక్కిరయి "ఇపుడు రానని చెప్పు ప్లీజ్, మళ్ళీ ఈ టైమ్ మనకి దొరకదు"అంటూ బతిమిలాడింది చేతులు పట్టుకొని వూపుతూ. ఎండలో వొచ్చేసరికి తట్టుకోలేకపోయినట్లు ముఖం చెపుతోంది. పైగా ఎక్కడ నేను కనిపించకుండా వెళ్ళిపోతానేమోనని టెన్షన్. వెంటనే మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చాను. అపార్ట్‌మెంట్ కల్చర్ ప్రభావం కాబోలు మనిషి లోపలికి రాగానే తలుపు లేశాను.

"తలుపు తియ్, ఎందుకు నేవెళ్ళిపోతాను" అంది విసుగ్గా.

నే హడావిడిగా

"అదికాదు..." అంటుంటే-

"ఏదీ కాదు కానీ వాళ్ళకి ఫోన్‌చేసి చెప్పు ప్లీజ్ గంట ఆగివస్తానని" అంది రిక్వెస్టింగ్‌గా.

"అలా కుదరదు. ఏమనుకుంటున్నావు? ఆఫీస్ పని. వాళ్ళంతా చూస్తూ వుంటారు"

"పెద్ద పనేలే. గంటలో ఏమీ కాదు.

హెవెన్స్ ఆర్ నాట్ పాలింగ్ డౌన్' నీవే కదా వాళ్ళ పై ఆఫీసర్‌వి. ఏదో వొకటి చెప్పు" అంది మారాంచేస్తున్నట్లు.

నేను ఇక ఫోన్ దగ్గరకెళ్ళి అసిస్టెంట్‌తో చెపుతూండగా వెనకనించి హమ్మింగ్‌గా "గంటసేపు గంటసేపు అని చెప్పు" అంటూ తను. చివరకు నేను 15 నిమిషాల్లో వస్తానని చెప్పి వెనక్కి తిరిగాను. ఆమె కళ్ళలో వచ్చేటపుడు కనిపించిన కాంతి మాయమైంది. నా ప్రెజన్స్ తనకి దొరకదని తను పడే ఆరాటం నన్ను మొదట ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. తర్వాత విచారపడేలా చేస్తుంది. నేను మాట తప్పినందుకు కోప్పడింది. కొట్టింది. చివరకు భుజంమీద గట్టిగా మెలిపెట్టి తన స్టయిల్లో కసితీర్చుకుంది.

"ఇప్పుడిక కోపం పోయినట్లేనా?"

కళ్ళు కిందికి వాల్చి పెదవులు బిగపట్టి నా ఆ ముఖంలో నిరాశ భరించలేకపోయాను. కరిగిపోయానా ఇక ఇంతే సంగతులు.

"డ్యూటీ అంటే మాటలా? బాధ్యతను మించి ఈ ప్రపంచంలో ఏదీ లేదు కూడా" అన్నాను.

"నే వెళతాను 15 నిమిషాలు మాత్రం దేనికి? ఇలారా నీ చెంప మీద ఒక్క ముద్దుపెట్టి వెళతాను" అంటూ నా చెయి పట్టుకుని ముందు గదిలోకి తీసుకువొచ్చింది.

మిట్టమధ్యాహ్నం వెలుగు వెన్నెలయి ప్రవహిస్తున్నట్లుగా పరిసరాలు కాంతివంతమయ్యాయి.

"నేనివాళ నీకు కొత్త పాట వినిపించుదామని వచ్చాను"

"తర్వాత వింటాలేమ్మా ధరా!"

"తర్వాత వద్దు. ఆనక రాజెవరో, రెడ్డెవరో, దళితుడెవరో, దళిత బ్రాహ్మణుడెవరో" అంది సీరియస్‌గా. నాకేం అర్థంకాలేదు. అట్లాగే చూస్తున్నా.

"అబ్బ! ఇక్కడ్నించి చూస్తే ప్రపంచం అంతా కనిపిస్తోందిగా?"

"అవును. ప్రపంచం అంతా చూస్తుంది" అన్నాను ఆమెని స్పృహలోకి తీసుకురావాలన్నట్లు.

"మిట్టమధ్యాహ్నం అంతా నిద్రలో వుంటారులే" అంటూ నా ఎడమ చెంపమీద ఒక అలలా పెదవులు కదిలించి వెళ్ళిపోతూ "నీ ఆఫీసర్ జాబ్‌లే గొప్పులే వెళ్ళు" అంది తలుపు రెక్క పట్టుకుని సగం తల లోపలికి పెట్టి వెక్కిరిస్తున్న స్వరంతో.

నాకు మాట రాలేదు. వెళ్ళిపోయింది. వర్షం కురిసి వెలిసినట్లయి చెంప తడుముకున్నా. అప్పుడప్పుడూ ఆమె ఇచ్చే ఈ చెంపల మీది చిన్నపిల్లల ముద్దులు నా కలవాటయిపోయినయ్. కానీ ఇవాళ నా ప్రయాణపు తొందరలో ఆమె డిసపాయింటింగ్ మూడ్‌లో దోసిట్లోకి ముఖాన్ని తీసుకుని గాఢంగా నా "ఫ్రాగ్రెన్స్" సోప్‌వాసన పీలుస్తూ ఇచ్చే స్పర్శ 'ఆఁ చాలు చాలు' అనటం...! తల విదిలించి బాగ్‌కోసం వెదికాను. కనిపించలేదు. చూస్తే ఫ్రిజ్ వెనక దాచింది. నవ్వుకుని బాగ్ తీసుకుని బయటికి వస్తూ అప్పుడనుకున్నా, ఈ ఆఫీసర్ పదవి అనే ఫ్రేమ్‌లో నేను చిక్కుకున్నట్లు. అలా ఎప్పుడూ అనుకోలేదు అదివరకు.

ఆ రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చేసరికి తాళం దగ్గర ఒక చిన్న స్లిప్-

"బీద అనాథ బాలికలా నీకోసం వేచి వుంటాను నీవు వచ్చే దారిలో"

స్నానం చేసి అన్నం తిని ఆమె నాకు చదవమని ఇచ్చిన ఓ అర్థంకాని పుస్తకం పట్టుకుని చదవకుండా ఆ స్లిప్ తీసుకుని మళ్ళీ ఆ వాక్యం చదివాను.

నేను శ్రమపడుతున్నందుకూ, డ్యూటీ మైండెడ్‌గా వున్నందుకూ దేవుడు కరుణించి ఈ శైశవ హృదయాన్ని నాకు

**ఒద్దు. ఆమెని మార్చాలని ప్రయత్నం వద్దు. అందరిలా ఆమె మారిపోతే "ఎక్కడికెళ్ళావ్ నువ్వు. నీ కోసం నే వెతుక్కున్నాను"- ముద్దుగా వుండే ఈ మాటలు వినలేదు. ఆ తమాషా మాడ్యులేషన్ ఫీల్‌కాలేదు. "ఆ పువ్వులన్నీ వాడిపోయాయి పాపం" అంటూ పూల పరామర్శ వినలేదు.**

బహుమతిగా ఇచ్చినట్లు తోచింది. హఠాత్తుగా ఇదేమిటి నేను కూడా ఆమె స్టయిల్లో ఆలోచిస్తున్నాను? ఆమె పసిమాటలు ఆ ప్రవర్తన ఆ స్పర్శ ఏది చూసినా ఆత్మీయంగా కనిపిస్తుంది. ప్రపంచం అర్థం చేసుకోలేని స్పర్శ అది. "ఎందుకలా చిన్నపిల్లలా ప్రవర్తిస్తావు? ఎందుకలా చిన్నపిల్లలా మాట్లాడతావు?" అని చాలాసార్లు హెచ్చరించాను. ఆమెని ఈ చిన్నతనం నించి పెద్దదాన్ని చేయాలని. ఆ నిర్మలతలో వున్న మాధుర్యాన్ని ఒక్కోసారి ఫీల్ అవుతూ ఒక్కోసారి భయపడుతూ. మలినం చేయాలన్న తలంపు కాదుగానీ ఈ లౌకిక వ్యవహారాను అర్థం చేయించాలన్న ఆలోచనతో. ఆమె సమక్షంలో మామూలు వాళ్ళకయితే మస్తిష్కం పనిచేయదు. నేను అనేకానేక లౌక్యుల మధ్య రాటుదేలిన నేను కాబట్టి 'బుద్ధి'ని పోగొట్టుకోకుండా వుండగలిగాను. ఆ భావోద్వేగపుటలలు వొచ్చి బలంగా తాకినయ్ అంటే ఇక పని అయినట్లే అనిపించింది చాలాసార్లు. దేహానికి సంబంధించిన సంగతి అయితే ఇలా మధనపడటం వుండదేమో?! ఆమె ప్రవర్తనలో బాగా కొట్టవచ్చినట్లు కనిపించేది ఒక ఆరాధనా భావన. ఒకనాటి సాయంకాలం నా కాళ్ళ దగ్గర కూచుని నా ముఖం వంక పరిశీలనగా చూస్తూ 'జస్ట్ యువర్ ప్రెజెన్స్ ఈజ్ ఇనఫ్' అంది నా పాదాలని తన చేతి వెల్వెట్‌టచ్‌తో కదిలిస్తూ. చేపపిల్ల కాళ్ళని చుట్టేసిన ఫీలింగ్. ఆ స్పర్శలో అంతర్‌నీలంగా వున్న ఫీలింగ్ ఆమెకి స్పష్టం చేయాలని నేను ప్రయత్నించాను.

ఆమె అసలా ధోరణి పట్టించుకోనట్లు "అదేమంత పెద్ద విషయమనీ" అంది. ఏది పెద్ద సంగతి ఏది కాదో నాకర్థం కాలేదు. మాట్లాడుతూ మాటమాటకీ చిన్నపిల్లలా తడుతూ వుంటుంది. ఆమెకో అలవాటది.

ఒకసారి కూచున్నంత సేపూ బుద్ధిగా కూచుని ఇక వెళుతున్నప్పుడు కూడా తాకలేదు. నవ్వుతూ అంది-

"చూశావా ఇంతసేపూ నిన్ను తాకకుం



డా కూడా కూచోగలను".

ఆమె అంతే. కానీ నేను నేనామె హైయర్ ప్లేన్స్‌నీ, కల్చర్డ్ టాక్‌ని అందుకోలేకపోతున్నాను. పైగా చుట్టూతా మనుషులూ, బాధ్యతలూ, బంధాలూ విడదీయలేనివి. అదేదో పుస్తకం ఎప్పుడో చదివింది... ఒక డాక్టర్ ప్రాక్టీస్‌నీ సమస్తాన్నీ వదిలేసి బతుకుని ఒక తన్ను తన్ని తనని ఆరాధించే అమ్మాయితో ఎక్కడికో అడవుల్లోకి జీవించడానికి వెళ్ళిపోతాడు. కానీ వాస్తవ జీవితం ఎంత కఠినమయినది! ఎప్పుడూ నేననే సోషియల్ పారామీటర్స్ అనే మాటని ఆమె వెక్కిరిస్తుంది. ఎలాయినా ఆమె మనస్తత్వాన్ని మార్చాలనీ ఆ పసితనాన్ని పోగొట్టాలనీ నా ప్రయత్నం...!

కానీ ఆమె హఠాత్తుగా అలా మారిపోతే తాను భరించగలడా? అందరిలా ఆమె కూడా... అందరిలా ఆమె... ఉహుఁ. ఆ ఊహ రుచించడం లేదు. అందరిలా ఆమె మారకపోతే ఏం పోయింది? అసలెందుకు మారాలి? అందరిలా ఆమె మారిపోతే ఆ ముదురుతనాన్ని తను చూడగలడా? ఆ వెన్నెల పలుకరింతలకు బదులు 'హిపోక్రసీ'ని వినగలడా? స్తలాల గురించీ, పొలాల గురించీ, బాంక్ బ్యాలన్స్ గురించీ మాట్లాడుతూ...!

'ఈ చేతికింకా ఓ నాలుగు బంగారు గాజులు చేయించండీ'

'ఈ చెవుల దిద్దులు బాగోలేవు. రేపు మార్పించాలి'

'అక్కడ పొలం అమ్మేసి ఇక్కడ ఫ్లాట్ కొనాలి'

'వాళ్ళకేమండీ లక్షాధికారులు'

'ఆ విమల అదేమిటండీ? వాళ్ళాయనతో ఆ మోడల్ సినిమాలకీ, షికార్లకీ తిరుగుతున్నా పట్టించుకోదు. వాళ్ళిద్దరినీ ఒకేచోట చూశాను మొన్నామధ్య'

'ఆఁ నా బొంద కులంలో ఏముందీ అనుకున్నామా ఆ మధ్య..., ఇపుడంతా కులంలోనే వున్నాయంటున్నారండీ'

- ఇలా సిల్లీ వాగుడు ఆమెనించి భరించగలడా? ప్రతిదానికీ ప్రయోజనాన్ని ఆశించటం, మితిమీరిన సెల్ఫిష్‌నెస్, ఇతరులని నొప్పించాలని వీళ్ళు చెప్పే గొప్పలు, మనుషులకి వీళ్ళు కాసే కాపలాలు, యాచకుడు దాహం అంటున్నా మండుటెండల్లో కూలర్స్ ముందు నిద్రపోతూ మనిషిపట్ల ఏమాత్రం కన్‌సర్న్ లేక...

మొదటిసారిగా ఈ లైఫ్‌స్టయిల్ పట్ల నేను ఆలోచనలో పడినట్లయింది.

ఒద్దు. ఆమెని మార్చాలని ప్రయత్నం వద్దు. అందరిలా ఆమె మారిపోతే "ఎక్కడికెళ్ళావ్ నువ్వు. నీ కోసం నే వెతుక్కున్నాను"- ముద్దుగా వుండే ఈ మాటలు వినలేదు. ఆ తమాషా మాడ్యులేషన్ ఫీల్‌కాలేదు. "ఆ పువ్వులన్నీ వాడిపోయాయి పాపం" అంటూ పూల పరామర్శ వినలేదు. కళలో లీనమయిన ముఖాన్ని చూడలేడు. కోయిల పలుకరింతకి దూరం అవుతాడు. మండుటెండలో చలివేంద్రం కనిపించదు. మాటలో నడకలో చేతలో ఒక అన్వేషణ చూడడు. మానవ సంబంధాల మాధుర్యానికే దూరం అవుతాడు.

"ఒద్దు, నీవు వినలేవు ఆ కష్టాలు విని తట్టుకోలేవు. నీవు పురుషుడివి బలహీనుడివి. నేను స్త్రీని, రాక్షసిని ఆ అవమానాలన్నీ భరించగల శక్తిగలదాన్ని"

నన్ను వివశుడ్ని చేసే ఈ కొత్త మాటలు దొరకవు. ఆమెని ఆమె స్వభావానికి అనుగుణంగా వుండనిస్తేనే తన హృదయానికి శాంతి. తన ఆత్మకి శృతి. అపుడామెలో ఒక ప్రత్యేక ప్రపంచాన్ని వెదుక్కోగలడు క్షణమైనా. ఆమె నా ప్రయాణం ముందు "గంటసేపు గంటసేపు వుండు" అనడం గుర్తొచ్చింది. ఆమె నా క్షణకాలపు సాయంకాలం కల.